క్లుప్తంగా

వృద్ధులను గౌరవిద్దాం



ఉదయగిరి రూరల్: ప్రతిఒక్కరూ వృద్ధులను గౌరవించాలని సీహెచ్‌ఓ శివకుమారి అన్నారు. మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోవృద్ధులు వైద్యశాలకు వస్తే సిబ్బంది గౌరవించి వైద్య సేవలు అందించాలన్నారు. నెలనెలా వైద్య పరీక్షలు చేసుకుంటున్నారా, మందులు సక్రమంగా వినియోగిస్తున్నారా.. అని అడిగి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానికులు, వృద్ధులు పాల్గొన్నారు.

డీఏలు ప్రకటించాలని డిమాండ్



సభ్యత్వ నమోదు చేయిస్తున్న యూటీఎఫ్ నాయకులు

సీతారామపురం: ప్రభుత్వం దీపావళి కానుకగా రెండు డీఏలను వెంటనే ప్రకటించి పీఆర్సీ కమిషన్‌ను నియమించడంతో పాటు, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎడమ తిరుపతయ్య డిమాండ్ చేశారు. ఆయన బుధవారం మండలంలో పర్యటించి పలు పాఠశాలల్లో నూతనంగా విధుల్లో చేరిన 18 మంది ఉపాధ్యాయులను కలిసి యూటీఎఫ్ సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండలాధ్యక్షుడు భోగ్యం శ్రీనివాసులు, జిల్లా కౌన్సిలర్ పేరాల శ్రీనివాసులు, పీసీఎం కొండయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్ల పరిశీలన



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లను ఎంపీడీఓ ప్రసన్నకుమారి పరిశీలించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని 2, 6 వార్డులకు ప్రభుత్వం ఇటీవల సిమెంట్ రోడ్లు మంజూరు చేసింది. వీటి నిర్మాణం మంగళవారం చేపట్టగా బుధవారం ఆమె నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలకు తగినట్లు సిమెంట్ రోడ్లు వేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సర్పంచ్ జిలానీ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



మర్రిపాడు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చుంచులూరు ఎస్సీ కాలనీ పాఠశాల హెచ్‌ఎం దొంతు రత్నయ్య, మండలావార్డు గ్రహీత పోలిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ సీఎంఆర్టీ అవార్డు గ్రహీత భాగ్యమ్మలను సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులు స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ–1 తిరుపతయ్య మాట్లాడుతూ అవార్డు గ్రహీతలు రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 ధనలక్ష్మి, చుంచులూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయభాస్కర్, కదిరినాయుడుపల్లి క్లస్టర్ హెచ్‌ఎం రవీంద్ర, టీఏన్‌పేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, విశ్రాంత ఎంఈఓ జొన్నా సత్యనారాయణ, విశ్రాంత హెచ్‌ఎం కలిశెట్టి వెంకటరమణయ్య, విశ్రాంత ఉపాధ్యాయిని అరుణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి

కావలి(అల్లూరు): కొన్ని సందర్భాల్లో గుండె ఆగిపోయినప్పుడు తిరిగి పనిచేసేందుకు నిర్వహించే సీపీఆర్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా రెడ్‌క్రాస్ ఫీల్డ్ ఆఫీసర్ సుందరరాజు అన్నారు. కావలి మండల పరిధి రుద్రకోట గ్రామంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నమూనా పద్ధతిలో చేసి చూపించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీలకు ప్రత్యేక ఆధార్ క్యాంప్

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఎస్టీల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు కమిషనర్ సి.గంగాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బస్టాండ్ సమీపంలోని సచివాలయంలో నేటి నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు ప్రత్యేక ఆధార్ క్యాంపును నిర్వహిస్తున్నామని, ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీధి కుక్కలతో భయం.. భయం..

కలిగిరిలోని చిన్నవీధిలో కుక్కల గుంపు



- నిత్యం ఏదో ఒకచోట దాడి
- బెంబేలెత్తుతున్న ప్రజలు, వాహనదారులు

ఆరు నెలల్లో..	
కలిగిరి పీహెచ్‌సీ పరిధిలో..	
కుక్కకాటు కేసులు	309



కలిగిరి ప్రధాన రహదారిపై గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరిలో ప్రధాన రహదారిపై పదుల సంఖ్యలో వీధి కుక్కలు సంచరిస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వీటి సంచారం మరింత ఎక్కువగా ఉంటున్నాయి. ఉదయాన్నే పలు పనుల మీద గ్రామాల నుంచి ప్రజలు నిత్యం కలిగిరి వస్తుంటారు. ప్రధాన రహదారిపై వాటిని దాటుకుని నడవాలంటే భయం.. భయంతో ముందుకు సాగాల్సి వస్తోంది. ఒక్కోసారి మొరుగుతూ ప్రజలపైకి ఉరుకుతున్నాయి. అదే విధంగా ప్రతి ఊరిలో వీధులతో పాటు ప్రధాన మార్గాల్లో కుక్కల బెడద రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తోంది.

మూగజీవాలపై కూడా..

వీధికుక్కలు ప్రజలతో పాటు మూగజీవాలనూ వదలడం లేదు. పశువులు కూడా వీటి బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. ఇళ్ల వద్ద పెంచుకుంటున్న కోళ్లను చంపి తింటున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేకలు, గొర్రెలపై కుక్కల దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. రాత్రివేళల్లో వీధి కుక్కల అరుపులకు నిద్రపట్టక ప్రజలు అవస్థలు పడుతున్నారు. చిన్నపిల్లలను బయటకు పంపాలంటే భయపడాల్సిన పరిస్థితులు గ్రామాల్లో నెలకొన్నాయి. దీనిపై అధికారులకు ప్రజలు తరచూ ఫిర్యాదులు చేస్తున్నారు. అయినా పంచాయతీ పాలకుల నుంచి ఎలాంటి స్పందన ఉండడం లేదు.

రేబిస్‌తో గేదె మృతి చెందింది



ఇటీవల పిచ్చికుక్క కాటుతో రేబిస్ వ్యాధి కారణంగా సుమారు రూ.50 వేల విలువ చేసే గేదె మృతిచెందింది. మా గ్రామంలో పిచ్చికుక్కలు చాలా గేదెలు, దూడలను కరిచాయి. గ్రామంలో ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో వీధి కుక్కలు ఉన్నాయి.

– తానుపర్తి చినమాలకొండారెడ్డి, కృష్ణారెడ్డిపాళెం, కలిగిరి మండలం

కుక్కలను తీసుకొస్తే వ్యాక్సిన్లు వేస్తాం



ప్రస్తుతం ప్రతి గ్రామంలో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉంది. పశువైద్యశాలల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. పంచాయతీ పాలకమండలి వీధి కుక్కలను పట్టుకుని తీసుకొస్తే యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేస్తాం.

– సురేష్‌బాబు,
ఏడీఏ, ప్రాంతీయ పశువైద్యశాల, కలిగిరి

రోడ్డు నిర్మాణం చేపట్టాలని రాస్తారోకో



స్థానిక ప్రజలతో కలిసి రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు రూరల్: మండలంలోని బట్టేపాడు రోడ్డు నుంచి నల్లపరెడ్డిపల్లి, మురగళ్ల మీదుగా కనుపూరుపల్లి వైపు వెళ్లే రోడ్డును తక్షణం పునర్నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు బుధవారం నల్లపరెడ్డిపల్లి వద్ద రాస్తారోకో నిర్వహించారు. దశాబ్ద కాలంగా ఏడు కిలోమీటర్ల తారురోడ్డు పూర్తిగా ధ్వంసమై మూడు గ్రామాల ప్రజలు సమీపంలో ఉన్న ఆత్మకూరు పట్టణానికి చేరుకోవాలంటే పడరాని పాట్లు పడుతున్నారని ఆ పార్టీ ఇన్‌చార్జి గంటా లక్ష్మీపతి, రూరల్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతి పత్రాలు అందించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డు నిర్మాణం చేపట్టకపోతే భవిష్యత్‌లో నిరసన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కనుపూరుపల్లి, మురగళ్ల, నల్లపరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు, సీపీఎం పార్టీ నేతలు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఉదయగిరి: మద్యం షాపు లైసెన్సుదారులు, వినియోగదారులు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ లక్ష్మణస్వామి అన్నారు. ఆయన స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో మద్యం షాపు లైసెన్సుదారులు, నౌకరి నామాదారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సురక్ష యాప్ ద్వారా మద్యం బాటిళ్లను స్కాన్ చేసి నాణ్యతను తెలుసుకోవచ్చన్నారు. స్కాన్ చేసిన వెంటనే మద్యం బాటిల్ పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. సర్కిల్ పరిధిలో ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే 94409 02522 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎస్సైలు దీప్తికరంత్, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్లలను కాపాడుకుందాం



సంగం: మండలంలోని జెండాదిబ్బ మెయిన్ హైస్కూల్‌లో బాలికా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడపిల్లలను కాపాడుకుందాం.. అంటూ విద్యార్థినులు మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి విశేషాభిషేకం



ఆత్మకూరు: పట్టణంలోని పురాతన ఆలయమైన అలఘనాథ స్వామి ప్రాంగణంలో కొలువైన ఆంజనేయస్వామికి బుధవారం విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసశర్మ తొలుత పాలు, పెరుగు, తేనె, చెరకు రసం, పన్నీరు తదితర ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించి అనంతరం వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. మహిళలు సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

పంచాయతీ విభజనపై సమావేశం



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి

కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరి పంచాయతీ విభజనపై స్థానిక గ్రామ సచివాలయంలో అధికారులు బుధవారం సమావేశం నిర్వహించారు. కలిగిరి పంచాయతీ నుంచి జిర్రావారిపాళేన్ని విభజించడాన్ని సర్పంచ్‌తో పాటు 13 మంది వార్డు సభ్యులు వ్యతిరేకిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, సర్పంచ్ రాగి దివ్య, ఉపసర్పంచ్ పాలూరు కొండారెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


మండల సర్వసభ్య సమావేశం రేపు

దుత్తలూరు: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ ఎల్.చెంచమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సమావేశాల్లో తీర్మానాలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికపై చర్చిస్తామన్నారు. మండలంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

చేతుల శుభ్రతపై అవగాహన అవసరం

సీతారామపురం: చేతుల పరిశుభ్రతపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని ఎంఈఓలు మస్తాన్‌వలీ, ప్రవీణ అన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాషింగ్‌డే సందర్భంగా వారు బుధవారం పలు పాఠశాలల్లో విద్యార్థులకు చేతుల శుభ్రత వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. సబ్బునీటితో చేతులను శుభ్రం చేసుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చన్నారు.

మున్సిపల్ కార్యాలయ ఆవరణలో..



ఆత్మకూరు: మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డేను బుధవారం నిర్వహించారు. మెప్మా సీఎంఎం హర్షిత, సీఎంఓ మాధవీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీఓ పావని పాల్గొన్నారు. చేతులు శుభ్రపరుచుకునే విధానం గురించి ప్రత్యక్షంగా చూపారు. కమిషనర్ గంగాప్రసాద్, తహసీల్దార్ పద్మజాకుమారి, ఎంపీడీఓ రఫీఖాన్, చైర్‌పర్సన్ వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్ సర్దార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమాజ సేవతోనే అభివృద్ధి

ఆత్మకూరు: సమాజ సేవతోనే అభివృద్ధి సాధ్యమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కుమార్తె కైవల్యారెడ్డి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఎంజీఆర్ సమావేశ మందిరంలో ఆర్డీఓ పావని ఆధ్వర్యంలో బుధవారం పీ–4లో భాగంగా బండారుపల్లికి చెందిన బొమ్మిరెడ్డి మల్లీశ్వరి కుటుంబాన్ని కైవల్యారెడ్డి దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మల్లీశ్వరి కుమారుడు బాలు పాలిటెక్నిక్ కళాశాలలో ఫస్టియర్ చదువుతున్నాడని, ప్రమాదవశాత్తు మూడేళ్ల క్రితం అతని కాలు దెబ్బతిందని తెలిపారు. వారి కుటుంబ పరిస్థితి తెలుసుకుని దత్తత తీసుకున్నట్లు పేర్కొన్నారు. జైపూరు కాలు అమర్చేందుకు కావాల్సిన ఆర్థిక సాయాన్ని ఆమె అందజేశారు.

దేవస్థాన పునర్నిర్మాణ పనుల పరిశీలన



వింజమూరు(ఉదయగిరి): మండలంలోని గుండెమడకలలో సీతారాముల దేవస్థానం పునర్నిర్మాణ పనులను టీటీడీ అధికారులు, స్థానిక దేవస్థాన కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు. గ్రామంలో సీతారామస్వామి దేవస్థానం శిథిలావస్థకు చేరుకోవడంతో టీటీడీ ట్రస్ట్ ద్వారా రూ.కోటి నిధుల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నారు. ఈనెల 22న దేవస్థానం పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ సబ్‌స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వెంకటసుబ్బయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నూతన జీఎస్టీపై అవగాహన ర్యాలీ నేడు

ఉదయగిరి: నూతన జీఎస్టీపై అవగాహన ర్యాలీ ఉదయగిరి పట్టణంలో గురువారం ఉదయం జరుగుతుందని ఎంపీడీఓ బి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి బయలుదేరి మెయిన్ రోడ్డు మీదుగా పంచాయతీ బస్టాండ్‌కు ర్యాలీ చేరుతుందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించే ర్యాలీలో మండలంలోని అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి



ఆత్మకూరు: బాణసంచా విక్రయదారులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఆత్మకూరు సీఐ ఎం.గంగాధర్ తెలిపారు. ఎస్సై జిలానీ, అగ్నిమాపక సిబ్బందితో కలిసి బుధవారం ఆయన పట్టణంలోని టపాసుల గోదాములను పరిశీలించారు. వారికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. టపాసులు విక్రయించేవారు ప్రభుత్వం నిర్దేశించిన స్థలాల్లోనే దుకాణాలను ఏర్పాటు చేసి విక్రయించాలన్నారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉచిత పశువైద్య శిబిరం రేపు

సీతారామపురం: రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని అయ్యవారిపల్లి రైతుసేవా కేంద్రంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పాడి రైతులు సద్వినియోగం చేసుకుని పశువులకు గర్భకోశ వ్యాధులు రాకుండా నివారణ చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

ఆటో బోల్తా - పలువురికి గాయాలు

ఉదయగిరి రూరల్: మండలంలోని కృష్ణంపల్లి గ్రామ సమీపంలో ఆటో బోల్తా పడి పలువురు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణంపల్లి గ్రామానికి చెందిన పలువురు ఆటోలో దుత్తలూరు మండలానికి బొగ్గు బట్టీలో పని చేసేందుకు వెళ్తున్నారు. గ్రామ శివారు ప్రాంతానికి వచ్చేసరికి రోడ్డుకు అడ్డుగా గేదె రావడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కాశమ్మ, నాగూర్, వెంకటయ్య, వెంకటలక్ష్మమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ కార్తీక్ మరో ఆటోను పిలిపించి గాయపడిన వారిని ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వారిలో తీవ్రంగా గాయపడిన నాగూర్‌ను మెరుగైన చికిత్స కోసం ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాద ఘటనపై వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి విచారిస్తున్నారు.

ఘనంగా అబ్దుల్ కలామ్ జయంతి



కావలిలో అబ్దుల్ కలామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్



దుత్తలూరులో..



మర్రిపాడు గ్రంథాలయంలో..



వింజమూరులో..

కావలి(అల్లూరు): భారత మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతిని కావలి శాఖా గ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి బొమ్మల కోటేశ్వరి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- **సంగం:** భారతరత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ జయంతిని సంగం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి హెచ్‌ఎం బుజ్జయ్య, ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.
- **మర్రిపాడు:** మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, భారతరత్న అబ్దుల్ కలామ్ దేశానికే మణిహారమని మర్రిపాడు గ్రంథాలయాధికారి దివానపు నారాయణరావు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో అబ్దుల్ కలామ్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలామ్ జీవిత విశేషాలు, రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా ఆయన చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో మద్దిపాటి శ్రీనివాసులునాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.
- **దుత్తలూరు:** ఏపీజే అబ్దుల్ కలామ్ జీవితం స్ఫూర్తిదాయకమని విశ్వతేజ పాఠశాల కరెస్పాండెంట్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో అబ్దుల్ కలామ్ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- **వింజమూరు(ఉదయగిరి):** స్థానిక వివేకానంద జూనియర్ కళాశాలలో ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు బయ్యపురెడ్డి రామచంద్రారెడ్డి, డాక్టర్ మాశిలామణి, కళాశాల కరెస్పాండెంట్ మద్దూరి గోపాల్‌రెడ్డి, స్థానిక నేతలు రాజగోపాల్‌రెడ్డి, గూడా నరసారెడ్డి పాల్గొన్నారు.



సంగం జెడ్పీహెచ్‌ఎస్‌లో..

ఫ్లోరోసిస్ నివారణకు కృషి



విద్యార్థినిని పరిశీలిస్తున్న డాక్టర్ దివ్య

అనుమసముద్రంపేట: ఫ్లోరోసిస్‌ను పూర్తిస్థాయిలో నివారించేందుకు కృషి చేద్దామని తిరమన పీహెచ్‌సీ వైద్యాధికారి, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ దివ్య అన్నారు. ఏఎస్‌పేట మండలంలోని జమ్మవరం, కాకర్లపాడు గ్రామాల్లో ఆమె బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రజలకు ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పించి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫ్లోరోసిస్ పట్ల ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆమె వెంట చిరమన పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

బస్సుల్లేక ప్రయాణికుల ఇక్కట్లు



పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ఉదయగిరి: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బుధవారం సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కర్నూలు జిల్లాలో గురువారం జరిగే ప్రధాని నరేంద్రమోదీ సభకు జనసమీకరణ కోసం స్థానిక ఆర్టీసీ డిపో నుంచి 29 బస్సులు కేటాయించారు. దీంతో డిపో పరిధిలోని వివిధ మార్గాల్లో బస్సులు తిరగకపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. అలాగే వివిధ పనులపై ఉదయగిరి వచ్చిన వారు స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి అధిక చార్జీలు చెల్లించి గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వచ్చింది. గురువారం కూడా ఇదే పరిస్థితి కొనసాగనుంది.

25లోగా ఈ-పంట నమోదును పూర్తి చేయాలి

ఉదయగిరి రూరల్: మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సహాయకులు సమష్టిగా పని చేసి ఈనెల 25 నాటికి ఈ–పంట నమోదును నూరు శాతం పూర్తి చేయాలని తహసీల్దార్ ఎల్.రామ్మోహన్ తెలిపారు. ఆయన తన కార్యాలయంలో వీఆర్వోలు, వీఏఏలతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ–పంట నమోదులో ఇతర మండలాలతో పోల్చుకుంటే ఉదయగిరి వెనుకబడి ఉందన్నారు. మండలంలో 26,433 ఎకరాలు పంట నమోదు చేయాలని లక్ష్యం కాగా ఇప్పటివరకు 6,236 ఎకరాలను మాత్రమే నమోదు చేశామన్నారు. గడువులోపు లక్ష్యాన్ని సాధించేందుకు వీఆర్వోలను కూడా కేటాయించామన్నారు. ప్రతి వీఏఏ రోజులో 200 ఎకరాలకు తగ్గకుండా ఈ–పంట నమోదు చేయాలన్నారు. వీఆర్వోలు నాన్ క్రాప్ బుకింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలంలో 700 కౌలు రైతు కార్డులు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు 124 కార్డులు ఇచ్చామన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ షాజియా, ఏఎస్‌ఓ బి.సుమా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధ మహోత్సవం



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజా నాయబ్ రసూల్ దర్గాలో గౌస్ మొహిద్దీన్ గంధ మహోత్సవం మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా మహల్ నుంచి గలేఫాలు, గంధ కలశాన్ని తీసుకొని పూల దుప్పట్లు, మేళతాళాలతో ఊరేగింపుగా దర్గాకు చేరుకున్నారు. అక్కడ సమాధిపై గంధాన్ని పూసి వస్త్రాలు, పూల దుప్పట్లు కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సజ్జదా హఫీజ్ పాషా ఆధ్వర్యంలో హజరత్ ఖాజా నాయబ్ రసూల్, దొరసానమ్మల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు.